ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 22-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- దేశాభివృద్ధికి ఈశాన్య ప్రాంతం చోదక శక్తిగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 25 లక్షల అదనపు ఎల్‌పీజీ కనెక్షన్లను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక పాలనా సంస్కరణలను అమలు చేసిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.
- జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని కేంద్రమంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వెల్లడించారు.

=======================

దేశాభివృద్ధికి ఈశాన్య ప్రాంతం చోదక శక్తిగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో 5 వేల 100 కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గతంలో నిర్లక్ష్యం చేయబడిన ఈశాన్య ప్రాంతాలను 2014 తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి నిలయాలుగా మార్చిందని చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ని మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతి రాష్ట్రం జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగినప్పుడు మాత్రమే ఈ సంకల్పం సాకారం అవుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తదుపరి తరం GST సంస్కరణల అమలుతో పాటు GST పొదుపు ఉత్సవాన్ని ఈ రోజు నుంచి ప్రారంభించినట్లు నరేంద్ర మోదీ తెలియజేస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

=======================

వస్తు సేవల పన్ను జీఎస్టీ (2.0) సంస్కరణల అమలుతో దేశంలో పేద మధ్యతరగతి వర్గాలకు ఖర్చులు తగ్గి ఆదా పెరుగుతుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వెల్లడించారు. దేశంలో నేటి నుంచి అమలు చేస్తున్న GST సంస్కరణలు ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరుస్తాయని ఆయన అన్నారు. న్యూఢిల్లీలో వ్యాపారులతో ఈ రోజు కేంద్రమంత్రి సంభాషించారు. భారతదేశాన్ని స్వావలంబన శక్తిగా మార్చడానికి దుకాణదారులు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి విక్రయించాలని కోరారు. చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం ఈ సంస్కరణల లక్ష్యం అని కేంద్ర మంత్రి చెప్పారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... నవరాత్రి పండుగ సందర్భంగా GST సంస్కరణలను అమలు చేయడం వల్ల కొనుగోళ్ళలో పెరుగుదల ఉంటుందని అన్నారు.

======================

ప్రజలకు మెరుగైన పాలనా సదుపాయాలను అందించేందుకు గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేసిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఫలితంగా అన్ని రంగాలలో పారదర్శకత, పౌర కేంద్రీకృత పాలనా విధానాలు వంటివి అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. విశాఖపట్నంలో జరుగుతున్న 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ 2025కు ఆయన ఈ రోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వికసిత్ భారత్ 2047 అనేది కేవలం ఆకాంక్షాత్మకమైనది కాదని.. మార్గదర్శక సూత్రమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. విశాఖ నగరం విశేషమైన ప్రగతిని సాధిస్తోందని జితేంద్ర సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

దేశంలోని మహిళలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 25 లక్షల అదనపు LPG కనెక్షన్లను అందించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీలో పాత్రికేయులతో కేంద్ర పెట్రోలియం సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఈ రోజు మాట్లాడుతూ... ప్రతి కనెక్షన్‌కు ప్రభుత్వం రెండు వేల రూపాయలకు పైగా ఖర్చు చేస్తుందని తెలిపారు. ఈ నిర్ణయంతో ఉజ్వల కుటుంబ సభ్యుల సంఖ్య 10.58 కోట్లకు పెరుగుతుందని అన్నారు. మహిళలకు శుభ్రమైన వంట ఇంధనం సులభంగా అందుబాటులో ఉండేలా చూస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేస్తూ.. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా అందరికి గృహ సదుపాయం అనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

======================

ప్రాచీన వైద్య సంపద అయిన ఆయుర్వేదాన్ని దేశంలో అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని గోవాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (AIIA) డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ ప్రజాపతి తెలిపారు. 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా పనాజీలో విలేకరులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఆయుర్వేదం ప్రాముఖ్యత గురించి తెలియచేసేందుకు ప్రతి ఏడాది ఆయుర్వేద దినోత్సవం జరుపుతున్నామని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య రంగానికి ఆయుర్వేదాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

=======================

న్యూఢిల్లీలో రేపు జరిగే 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. జాతీయ ఉత్తమ చిత్రంగా `12th ఫెయిల్` హిందీ చిత్రానికి అవార్డు ప్రదానం చేస్తారు. జాతీయ ఉత్తమ నటుడి విభాగంలో `జవాన్` చిత్రంలో నటించిన షారుఖ్ ఖాన్ కి అలాగే `12th ఫెయిల్` చిత్రం నటుడు విక్రాంత్ మాస్సీకి ప్రదానం చేస్తారు. ప్రముఖ నటుడు మోహన్ లాల్ కు 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కూడా రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రదానం చేయనున్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

ఒడిసాలోని కొన్ని ప్రాంతాల్లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. ఆ వివరాలను వాతావరణ విభాగం అధికారి డాక్టర్ అఖిల్ శ్రీవాత్సవ తెలియచేస్తూ... ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఉత్తర కర్ణాటక విదర్భలలో కూడా రేపు భారీ వర్షాలు కూరుస్తాయని పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో మెరుపులతో కూడిన ఉరుములు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

=======================
=======================